# కొండగట్టులో నూతన వాహన పూజా షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

రూ.35.19 కోట్ల అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు
180 ఎకరాల అటవీ భూమి బదలాయింపుపై చర్యలు
నవంబర్‌లో వైభవంగా శ్రీ స్వామివారి చందనోత్సవం



**కొడిమ్యాల సెప్టెంబర్ 06.(నవగీతం)** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని ప్రసిద్ధ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో నూతన వాహన పూజా షెడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపెల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. 'వై' జంక్షన్ సమీపంలో 60ఐ100 అడుగుల విస్తీర్ణంలో ఈ షెడ్డు నిర్మించనున్నారు. 30 నుండి 40 రోజుల్లో పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.రాత్రివేళల్లో సుమారు 1,000 మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా దీనిని వినియోగించనున్నారు. కొండగట్టు దేవస్థాన అభివృద్ధిలో భాగంగా సుమారు 180 ఎకరాల అటవీ భూమిని దేవస్థానానికి బదలాయించే ప్రక్రియపై గ్రౌండ్‌వర్క్ జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు.అలాగే రూ.35.19 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక సమస్యలను పరిష్కరించి త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. దేవస్థానం సమగ్ర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు చెప్పారు.శ్రీ స్వామివారి చందనోత్సవాన్ని నవంబర్ 15 నుంచి 20 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నవంబర్ 20న ఉదయం 9.57 గంటలకు సుముహూర్తం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నట్లు తెలిపారు.కార్యనిర్వహణ అధికారి అంజనరెడ్డి. స్థానిక సర్పంచ్ దారం ఆదిరెడ్డి నాయకులు బత్తిని శ్రీనివాస్. ప్రధాన అర్చకులు స్థానాచార్య కపిందర్.చిరంజీవ స్వామి,టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్. సునీల్ అర్చక బృందం,సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టా లింకులు, యాప్‌ల పేరుతో రైతు రెక్కలు విరవొద్దు.

ఎరువుల పంపిణీలో సాంకేతిక ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలి.
జాడి ఈశ్వర్ నేతకాని.




**ములుగు, సెప్టెంబర్ 06.(నవగీతం)** రైతును రాజు చేయడం అంటే యాప్‌ల చుట్టూ తిప్పడమా? ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో పట్టాలు లేని రైతుల పరిస్థితి ఏమిటి?
పెరిగిన పెట్టుబడులు, పురుగుమందుల ధరలు దిగుబడికి దక్కని గిట్టుబాటు ధర అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతుల ఆత్మహత్యలు శవాల మీద పేలాలు ఏరుకుంటున్న రాజకీయ నాయకులు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలనీ ఏజెన్సీ నేతకాని కుల హక్కుల పోరాట సంఘం నాయకులు జాడి ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి వెన్నుముక రైతు, రైతే రాజు అని రైతు లేనిదే అన్నం లేదు అని సభల్లో, వేదికలపై గొప్పగా ఉపన్యాసాలు దంచే కేంద్ర ప్రభుత్వాల మరియు రాజకీయ నాయకులు, ఆచరణలో మాత్రం రైతులకు ఉరితాళ్లు బిగిస్తున్నారని, నిత్యావసరం అయిన ఎరువుల పంపిణీకి పట్టాదారు పాస్‌బుక్కులు, మొబైల్ యాప్‌లు, ఆధార్ లింకింగ్‌లు ముడిపెట్టి సామాన్య రైతులను తీవ్ర కష్టాల పాలు చేయడం దారుణమైన చర్య అని తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త, ఏజెన్సీ నేతకాని కుల హక్కుల పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జాడి ఈశ్వర్ నేతకాని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక విస్తృత పత్రికా ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శనాస్త్రాలు సంధించారు:
డిజిటల్ లంకెలు సామాన్య రైతులకు సంకెళ్లు.
చదువురాని, స్మార్ట్‌ఫోన్ వాడకం తెలియని సామాన్య రైతులకు 'యాప్‌ల' ద్వారా ఎరువుల పంపిణీ పేరిట కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టారనీ, చేనులో చెమటోడ్చి పనిచేసే రైతును రోజంతా సొసైటీల ముందు, ఎరువుల దుకాణాల ముందు క్యూలో నిలబెట్టి, సర్వర్లు పనిచేయలేదనో, ఓటీపీలు రాలేదనో తిప్పి పంపడం ఎంతవరకు న్యాయం అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు?. అదేవిధంగా
పట్టాలు లేని ఏజెన్సీ ప్రాంత రైతుకు, కౌలు రైతుల పరిస్థితి ఏమిటనీ, ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా హక్కు పత్రాలు (పట్టాలు) లేకుండా భూములను సాగు చేసుకుంటున్న నేతకాని, దళితగిరిజన, నిరుపేద రైతులు మరియు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కౌలు రైతుల పరిస్థితి ఏంటనీ భూమి పట్టా ఉంటేనే ఎరువులు ఇస్తామంటే.. ఆ భూమినే నమ్ముకుని బతుకుతున్న పట్టాలేని పేద రైతులు వ్యవసాయం మానెయ్యాలా? వారు అన్నం తినడం మానేసి ఆకలితో అలమటించాలా కేంద్ర ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా విపరీతంగా పెరిగిన సాగు వ్యయం భరించలేని పెట్టుబడి భారంఅవుతుందని నేడు వ్యవసాయం చేయడం అంటే ఒక జూదంలా మారిందనీ,డీజిల్ ధరలు, దుక్కి దున్నే ట్రాక్టర్ల ఛార్జీలు, విత్తనాల ధరలు, కూలీల రేట్లు ఆకాశాన్ని అంటాయి. దానికితోడు ఎరువులు, పురుగుమందుల కంపెనీలు ధరలను విపరీతంగా పెంచి రైతుల రక్తాన్ని పిండుకుంటున్నాయనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరానికి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట పండిస్తే, తీరా మార్కెట్‌కు తీసుకెళ్లేసరికి దళారులు, వ్యాపారులు కుమ్మక్కై మద్దతు ధర లేకుండా చేస్తున్నారనీ కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తుంది అని మండిపడ్డారు. అప్పుల ఊబిలో రైతులు కూరుకపోతున్నారని, రైతుల ఆత్మహత్యల పెరుగుతున్న ప్రభుత్వాలు నిశ్శబ్దంగా మౌనం పాటిస్తున్నాయని, ఒకవైపు ఆకాశాన్నంటిన పెట్టుబడి ఖర్చులు, మరోవైపు మార్కెట్‌లో దిగుబడికి దక్కని చవక ధరలు. ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న రైతు చివరకు ప్రైవేట్ వ్యాపారులు, వడ్డీ వ్యాపారుల దగ్గర రెట్టింపు వడ్డీలకు అప్పులు తెచ్చి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా, కష్టపడి పండించిన పంట అమ్మినా తెచ్చిన అప్పులు తీరక, కుటుంబ పోషణ భారమై, పరువు కాపాడుకోలేక చివరికి పురుగుల మందు తాగి కన్నుమూస్తున్నారని అన్నారు .రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యమవుతున్నా ఏలికలకు, రాజకీయ నాయకులకు కనికరం కలగకపోవడం శోచనీయం అని రైతులను పట్టించుకొని దౌర్భాగ్య ప్రభుత్వాలపై అసహనం వ్యక్తం చేశారు. రైతు లేకపోతే దేశానికే అన్నం లేదు అనీ రాజకీయ నాయకులు కేవలం ఓట్ల కోసమే రైతుపై ప్రేమను నటిస్తున్నారనీ, ఓట్ల సమయానికి పథకాల పేరుతో మభ్యపెడుతూ, తీరా అధికారంలోకి వచ్చాక ఎరువులను సరిగ్గా అందుబాటులో ఉంచకుండా, విధానాల పేరుతో కృత్రిమ కొరత సృష్టించి రైతులకు సాగు నీళ్లు, విత్తనాలు, ఎరువులు , డీజిల్ , పెట్రోల్ అందకుండా చేయడం అంటే దేశ ఆహార భద్రతను దెబ్బతీయడమే అని అన్నారు.తక్షణమే సాంకేతిక ఆంక్షల రద్దు చేసి ఎరువుల విక్రయాలకు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ ఓటీపీలు, సంక్లిష్టమైన యాప్‌ల నిబంధనలను వెంటనే రద్దు చేయాలనీ,
పట్టాలు లేని రైతులకు ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయ సాగుదారులు, నిరుపేద నేతకాని దళిత గిరిజన రైతులు మరియు కౌలు రైతులకు ఆధార్ లేదా గుర్తింపు కార్డుల ప్రాతిపదికన ఎరువులు పంపిణీ చేయాలనీ అన్నారు.
ఎరువులు, పురుగుమందుల ధరలపై నియంత్రణచేసి విపరీతంగా పెరిగిన పురుగుమందులు, ఎరువుల ధరలపై సబ్సిడీ పెంచి, రైతులకు అందుబాటులో ఉంచాలనీ తెలిపారు.
స్వామినాథన్ కమిషన్ అమలు చేసి రైతు పండించిన ప్రతి పంటకూ మద్దతు ధర కల్పిస్తూ చట్టబద్ధమైన గ్యారెంటీ ఇవ్వాలనీ, అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను తక్షణమే ఆదుకొని, రుణమాఫీ సక్రమంగా వర్తింపజేసి రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేయాలనీ అన్నారు. పంట పండించే ప్రతి రైతుకూ సులభంగా ఎరువులు, సాగు సామాగ్రి అందడం వారి ప్రాథమిక హక్కు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు నిద్రమత్తు వదిలి స్పందించకపోతే, ఏజెన్సీ నేతకాని కుల హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ఉద్యమాలకు సిద్ధం అవుతామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.

# రాష్ట్రంలో త్వరలో ఇందిరమ్మ బీమా పథకం..

విద్యార్థులను భవిష్యత్తు మానవ వనరులుగా తీర్చిదిద్దడం లక్ష్యం..
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క..



**జగిత్యాల/ధర్మారం,సెప్టెంబర్7,(నవగీతం)** పేద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఇందిరమ్మ బీమా పథకాన్ని తీసుకు వస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఆదివారం రాత్రి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. రాత్రి 10 గంటలు దాటిన భట్టి విక్రమార్క కుస్వాగతం పలకడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ధర్మారంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకొని ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం గడిచిన రెండున్నర సంవత్సరాలుగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. ఇందులో భాగంగా 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని భట్టి తెలిపారు. రాష్ట్రంలో కోటి ఆరు లక్షల మందికి రేషన్ కార్డు అందజేయడంతో పాటు అరకిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని భట్టి తెలిపారు.తెలంగాణకు భవిష్యత్తు మంచి మానవ వనరులను అందించడానికి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు వారానికి మూడు రోజులపాటు పాలు రాగి, జావా అందజేస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని భట్టి తెలిపారు.రాష్ట్రంలో త్వరలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువస్తున్నారు ప్రతి నియోజకవర్గంలో రూపాయలు రెండు వందల కోట్లతో యంగ్ ఇండియాఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు భట్టి తెలిపారు.తెల్లవారితే అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పటికీ మంత్రి లక్ష్మణ్ కుమార్ నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ అనేక ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆహ్వానం మేరకు ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి భూమి పూజలు పాల్గొనడం జరుగుతుందని ఉపముఖ్యమంత్రి తెలిపారు.

## లెక్కల మాస్టారి ఉత్తమ సేవలకు అరుదైన గౌరవం

కొడంగల్ సభలో హెచ్‌ఎం రామకిషన్ రావుపై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశంసలు



**పెద్దపల్లి,సెప్టెంబర్ 06,(నవగీతం)** పెద్దపల్లి జిల్లా బేగంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్క రామకిషన్ రావు విద్యార్థులకు అందిస్తున్న విశిష్ట సేవలకు రాష్ట్ర స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొన్న కొడంగల్ సభలో,విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్వయంగా రామకిషన్ రావు చేసిన సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. రామకిషన్ రావు విద్యార్థులకు ఎంతో ప్రతిభావంతంగా గణితం బోధించడమే కాకుండా,వినూత్న కార్యక్రమాలతో వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారని,పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆయన తన సొంత ఖర్చులతో మొదటిసారి విమాన ప్రయాణ అనుభవాన్ని కల్పించడంపై ప్రిన్సిపల్ సెక్రటరీ సభ ముఖంగా ప్రశంసలు కురిపించారు.రాష్ట్ర స్థాయి సభలో, ముఖ్యమంత్రి సమక్షంలో పెద్దపల్లి జిల్లా ఉపాధ్యాయుని సేవలను ప్రత్యేకంగా గుర్తుచేస్తూ అభినందించడం జిల్లాకే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. రామకిషన్ రావు భవిష్యత్తులోనూ ఇటువంటి మరెన్నో ఉన్నత గౌరవాలు, పురస్కారాలు అందుకోవాలని పలువురు విద్యావేత్తలు,సహచర ఉపాధ్యాయులు, స్థానికులు ఆకాంక్షించారు.రామకిషన్ రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పిడుగు పాటుకు గురై వ్యవసాయ కూలీ రైతు మృతి

**ములుగు.సెప్టెంబర్06,(నవగీతం)** ములుగు జిల్లా వాజేడు మండలం చింతూరు గ్రామానికి చెందిన ములకల ఆనందరావు, వయసు (50) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన చెరుకూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది.
గ్రామస్థుల వివరాల ప్రకారం ఓ రైతు చేనులో మిర్చి తోట సాగు కోసం ఆనందరావు కూలీగా పనికి వెళ్లాడు.ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో మరో వ్యక్తితో కలిసి ఎద్దులతో నాగలి దున్నుతుండగా ఒక్కసారిగా వర్షం ప్రారంభమైంది. అదే సమయంలో పిడుగు పడటంతో ఆనందరావు, మరో వ్యక్తి, ఎద్దులు పిడుగుపాటుకు గురయ్యాయి. పిడుగు ధాటికి ఇద్దరూ స్పృహ తప్పి పడిపోగా, ఆనందరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి, ఎద్దులు ప్రాణాలతో బయటపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. మృతుడు ఆనందరావుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో చింతూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రిటైర్డ్ ఎంఈఓ పైడిపెల్లి రంగారావుకు తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాళి



**కొడిమ్యాల, సెప్టెంబర్ 06(నవగీతం )** కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ మండల విద్యాధికారి (ఎంఈఓ) పైడిపెల్లి రంగారావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తాటిపర్తి జీవన్‌రెడ్డి శనివారం పూడూరులోని ఆయన భౌతికదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం రంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయుడిగా, ఎంఈఓగా రంగారావు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఉపాధ్యాయ దినోత్సవం రోజే ఉత్తమ ఉపాధ్యాయుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని జీవన్‌రెడ్డి అన్నారు. విద్యారంగానికి రంగారావు చేసిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొని రంగారావుకు నివాళులర్పించారు.

## చిరుతపల్లి లో ముత్యాలమ్మ తల్లికి బోనాలు.



**ములుగు, సెప్టెంబర్ 06,(నవగీతం):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని బర్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ ముత్యాలమ్మ తల్లికి బోనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గ్రామ పరిధిలో ఉన్నటువంటి గ్రామదేవతలైన ముత్యాలమ్మ తల్లి. ఆంజనేయస్వామి, సదలమ్మ,బొడ్రాయి దగ్గర మహిళలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పుట్టిన బోనాలు పెట్టుకుని ఊరేగింపుగా డోలు వాయిద్యాలతో ముత్యాలమ్మ తల్లి గుడికి చేరుతున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలతో ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద భక్తులతో సందడి నెలకొంది ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

